క్లుప్తంగా

ఎర్ర దొంగ అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

తిరుపతి మంగళం: అన్నమయ్య జిల్లా రాజంపేట సెక్షన్‌లోని పించా డ్యామ్ వద్ద ఐదు ఎర్ర చందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ఓ స్మగ్లర్‌ను అరెస్ట్ చేసినట్టు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. ఆరోగ్యపురం సమీపంలోని చేయ్యేరు వద్ద కొందరు వ్యక్తుల అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేసినట్టు తెలిపారు. పోలీసులను గమనించిన వారు పారిపోతుండగా అందులో ఒకరిని అదుపులోకి తీసుకున్నట్టు వెల్లడించారు.ఎస్‌ఐ సీహెచ్.రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

కరపత్రాల ఆవిష్కరణ

చంద్రగిరి : కలెక్టరేట్ వద్ద మంగళవారం చేపట్టనున్న భారీ ధర్నాకు సంబంధించి కరపత్రాలను సోమవారం సీఐటీయూ మండల కమిటీ నేతలు ఆవిష్కరించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి జయచంద్ర మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల పిలుపు మేరకు ధర్నా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసన తెలపనున్నట్లు వివరించారు. ధర్నాకు పెద్దసంఖ్యలో ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి


మోహర్‌సింగ్ మృతదేహం

తిరుపతి రూరల్ : జీవనోపాధి కోసం రాజస్థాన్ నుంచి వలస వచ్చిన మోహర్‌సింగ్(34) అనే యువకుడు తిరుపతి రూరల్ మండలం గాంధీపురం పంచాయతీ ధనలక్ష్మినగర్‌లో సోమవారం అనుమానస్పదంగా మృతి చెందాడు. వివరాలు.. మోహర్‌సింగ్ తన అన్న రామ్మమూర్, సహచరులు ముకేష్, చింటూలతో కలిసి ధనలక్ష్మి నగర్‌లో రూమ్ అద్దెకు తీసుకుని నివసిస్తున్నాడు. ఆదివారం రాత్రి భోజనం చేసిన తర్వాత ఫోన్ మాట్లాడేందుకు మూడో అంతస్తు పైకి వెళ్లాడు. సోమవారం తెల్లవారుజామున ఇంటి వెనుక తీవ్రంగా గాయపడి కనిపించాడు. వెంటనే మిత్రులు రుయా ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మోహన్ సింగ్ ప్రమాదవశాత్తు బిల్డింగ్‌పై నుంచి కింద పడిపోయి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

దేదీప్యం..దీపోత్సవం


దీపాలు వెలిగిస్తున్న మహిళలు

- భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవారం పూజలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- దీపారాధన చేపట్టిన మహిళలు

తిరుపతి కల్చరల్ : కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, తిరుపతి ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం శ్రీరామచంద్ర పుష్కరిణి కళా వేదిక వద్ద దేదీప్యంగా కోటి దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శివలింగం ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు . మహిళలు పెద్దసంఖ్యలో దీపాలు వెలిగించి ఉత్సవాన్ని పరిపూర్ణం చేశారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి, కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పీసీ రాయులు, శాప్ చైర్మన్ రవినాయుడు హాజరయ్యారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి, పక్కన ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

కపిలతీర్థంలో.. :నగరంలోని శివాలయాలలో భక్తులు దీపారాధన చేపట్టారు. కపిలతీర్థంలోని పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి శివలింగాలకు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

కనుల పండువగా కల్యాణం
రాస్ సేవా సమితి ఆధ్వర్యంలో బొమ్మగుంటలోని శ్రీపద్మావతి ప్రార్థన మహిళా మండలిలో కనుల పండువగా శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన దిశా పోలీస్ స్టేషన్ డీఎస్పీ శ్రీలత మాట్లాడుతూ సంప్రదాయాలను గౌరవించడం సమాజానికి ఎంతో ఉపయోగకరమన్నారు. రాస్ పొదుపు సంఘాల ప్రాజెక్టు డైరెక్టర్ వి.నాగరాజు , రాజరాజేశ్వరి ఆలయ ప్రధాన అర్చకుడు ప్రకాష్ స్వామి బృందం , రాస్ ప్రతినిధులు నాగేశ్వర్ ,వాణి, నాగరాజు, జోత్స్న, రుక్మిణి, తులసి, వరలక్ష్మి, అనసూయ, రాజేశ్వరి పాల్గొన్నారు.

ముక్కోటి ఆలయంలో..
చంద్రగిరి : తొండవాడ సమీపంలోని స్వర్ణముఖీ నది ఒడ్డున వెలసిన శ్రీఅగస్తీశ్వర(ముక్కోటి)స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శాస్త్రోక్తంగా లక్ష బిళ్వార్చన జరిపించారు. ఆలయ ధర్మకర్త మొగిలి రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

కోటి లింగేశ్వర ఆలయంలో..
రామచంద్రాపురం: రాయలచెరువు కట్ట సమీపంలోని శ్రీ ఆంజేయస్వామి ఆలయ ప్రాంగణంలో కామాక్షి సమేత కోటి లింగేశ్వర ఆలయ కుంభాభిషేకం నిర్వహించారు.

30 కిలోల గంజాయి స్వాధీనం


నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

తిరుపతి క్రైమ్: తిరుపతిలో అక్రమంగా విక్రయిస్తున్న 30 కిలోల గంజాయిని సోమవారం ఈస్ట్ పోలీసులు స్వాధీనం చేసుకుని, ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. డీఎస్పీ వెంకటనారాయణ కథనం మేరకు.. తమిళనాడుకు చెందిన గురువీరెడ్డి రమణమ్మ, విజయకనుక, మల్లికాకేశవన్, రాజా మధు, షేక్ సంధ్యారాణి వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. రమణమ్మ నర్సీపట్నానికి చెందిన అప్పారావును సంప్రదించి 30 కిలోలు రూ.1.5 లక్షలకు కొనుగోలు చేసింది. దీన్ని సంధ్యారాణి అనే మహిళ సహాయంతో తిరుపతికి తీసుకు రాగా విజయ, మల్లిక, మరో సహాయకుడు రాజాతో కలిసి ఆర్టీసీ బస్టాండ్‌లో రమణమ్మకు అప్పగించినారు. వీరందరూ కలిసి బస్టాండ్ బయటికి వస్తుండగా పోలీసులు అరెస్ట్ చేశారు.

జియో ట్యాగింగ్‌లో పుత్తూరు గుడ్

తిరుపతి అర్బన్: హౌస్ హోల్డ్ మ్యాపింగ్ జియో ట్యాగింగ్‌లో పుత్తూరు మండలం పనితీరు బాగుందని, ఏర్పేడు, వెంకటగిరి, కేవీబీపురం మండలాల పనితీరు బాగోలేదని కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్, తిరుపతి కమిషనర్ నారపురెడ్డి మౌర్యతో కలసి మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపీడీవోలతోపాటు పలువురు అధికారులతో సమీక్షించారు. జియో ట్యాగింగ్ ప్రక్రియను ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని ఆదేశించారు. పలు మండలాల్లో పనితీరును మెరుగు పరచుకోవాలన్నారు. గ్రీవెన్స్ అర్జీలను సకాలంలో పరిష్కరించాలని చెప్పారు. ప్రైవేటు కళాశాలల్లో ట్యూషన్ ఫీజు కోసం విద్యార్థులను ఇబ్బందులు పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇసుక ఇబ్బందులను అధిగమించాల్సి ఉందని చెప్పారు. దీపం-2 పథకంపై శ్రద్ధ పెట్టాలని, ఎవరికి అప్పగించిన పనులు వారు బాధ్యతగా నిర్వర్తించాలని,. నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. సమీక్షలో ఆర్అండ్‌బీ అధికారులు రోడ్ల నిర్మాణానికి సంబంధించి పలు అంశాలను కలెక్టర్‌కు వివరించారు.

కార్యదర్శి అత్యుత్సాహంపై ఆగ్రహం

తిరుపతి రూరల్ : మండలంలోని గాంధీపురం పంచాయతీ కార్యదర్శి విజయనిర్మల అత్యుత్సాహంపై సర్పంచ్, వార్డు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పంచాయతీ పాలకమండలి సమావేశం నిర్వహించారు. సర్పంచ్ లక్ష్మీశివ మాట్లాడుతూ కనీస సమాచారం లేకుండా తీర్మానం చేయకుండా కొత్తగా ఆరుగురిని ఉద్యోగాల్లోకి తీసుకోవడం సరికాదని మండిపడ్డారు. సుమారు 15 నుంచి 20 ఏళ్లుగా పనిచేస్తున్న ఐదుగురు సిబ్బందిని ఇష్టారాజ్యంగా తొలగించడంపై నిరసన తెలిపారు. పంచాయతీ తీర్మానం లేకుండా తొలగింపులు, ఉద్యోగాల కల్పన ఎందుకు చేపట్టాల్సి వచ్చిందని ప్రశ్నించారు. ప్రతి నెల 5వ తేదీన సిబ్బందికి చెల్లించాల్సిన వేతనాలను ఇప్పటి వరకు ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. అనంతరం శ్మశానంలో ఆక్రమణలు తొలగించాలని, అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు నిర్మించాలని తీర్మానం చేశారు. సమావేశంలో వార్డు సభ్యులతోపాటు ఎంపీటీసీ సభ్యుడు జయకర్ పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ సినీ రజతోత్సవం


వీఏకే రంగారావును సత్కరిస్తున్న అతిథులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ సెనెట్ హాల్ వేదికగా సోమవారం ఎన్టీఆర్ సినీ రజతోత్సవం ఘనంగా నిర్వహించారు. 75 ఏళ్ల క్రితం ఎన్టీఆర్ నటించిన మొదటి చిత్రం ×మనదేశం₹ 1949 నవంబర్ 24వ తేదీ విడుదలైన రోజును పురస్కరించుకొని ప్రొఫెసర్ బాలసుబ్రమణ్యం అధ్యక్షతన ×ఎన్టీఆర్ సినీగేయ గోష్ఠి - వజ్రోత్సవ వేడుకలు₹ పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా ఎస్వీయూ వీసీ అప్పారావు, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్, రిజిస్ట్రార్ భూపతినాయుడు, ప్రధానవక్త బొబ్బిలి వారసులు బహుముఖ ప్రజ్ఞాశాలి వీఏకే రంగారావు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఎన్టీఆర్ పాత్రల్లో, పాటల్లో, నటనలో అణువణువూ భారతీయ సంస్కృతి, సంప్రదాయ శైలిలో ఉంటాయన్నారు. ప్రతి చిత్రంలో పేదవారి గురించి, సమాజం ఎదుర్కొంటున్న అనేక సాంఘిక, సమస్యల గురించిన కథలూ చూపిస్తూ, ప్రజలను చైతన్య పరిచే అనేక అంశాలు ఉండడం విశేషం అన్నారు. మనదేశం తొలి చిత్రంలో ఎన్టీఆర్ పాత్ర, షూటింగ్ ముచ్చట్లు పంచుకున్నారు. అతిథులను నిర్వాహకులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ సత్యవాణి, ఎన్టీఆర్ పీహెచ్‌డీ పరిశోధకులు దాసన్నగారి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికే పోరాటం



మాట్లాడుతున్న రవి

తిరుపతి కల్చరల్ : ప్రజా సంక్షేమం కోసమే పోరాటం చేస్తున్నట్లు ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఎన్‌డీ రవి తెలిపారు. సోమవారం గంధమనేని శివయ్య భవన్‌లో నగర కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ వద్ద మహాధర్నా చేపట్టనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో ఏఐటీయూసీ నేతలు గోవిందస్వామి, మహేంద్రబాబు, వెంకటేష్, సురేష్ పాల్గొన్నారు.

మరో పోరాటానికి సమాయత్తం


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ, ఆప్కాస్ సంఘాల నాయకులు

తిరుపతి సిటీ: దేశ వ్యాప్తంగా కార్మిక, రైతు కర్షక సంఘాల పిలుపులో భాగంగా మంగళవారం కలెక్టరేట్ వద్ద కార్మికుల సమస్యలపై జరుగుతున్న భారీ ధర్నాను జయప్రదం చేయాలని, వెటర్నరీ యూనివర్సిటీ ఆప్కాస్ యూనియన్, సీఐటీయూ పిలుపునిచ్చింది. ఈ మేరకు వెటర్నరీ వర్సిటీలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర, ఆప్కాస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జీ.చిన్నబాబు, కన్వీనర్ గండికోట నాగ వెంకటేష్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కే.సుమన్ కార్మికులతో కలసి డిమాండ్లతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్మికులు మరో పోరాటానికి సమాయత్తం కావాలని పిలుపు నిచ్చారు.

తప్పిన సమస్యలు.. సంతోషంలో అర్జీదారులు

- గ్రీవెన్స్‌కు 222 అర్జీలు

తిరుపతి అర్బన్: హమ్మయ్యా.. ఎట్టకేలకు గ్రీవెన్స్‌లో వసతులు కల్పించారు. 'సాక్షి' వరుస కథనాలతో అధికారులు స్పందించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చే అర్జీదారుల సమస్యలను పరిష్కరించారు. సోమవారం అందరికీ సరిపడా కుర్చీలు ఏర్పాటు చేశారు. అలాగే తాగునీటి వసతి కల్పించారు. అధికారులు అర్జీదారులతో గౌరవంగా మాట్లాడే పద్ధతిని అలవాటు చేసుకున్నారు. దీనిపై పలువురు సంతోషం వ్యక్తం చేశారు. ఇదిలావుండగా సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌కు మొత్తం 222 అర్జీలు వచ్చినట్లు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. జేసీ శుభం బన్సల్‌తోపాటు డీఆర్వో నరసింహులు పాల్గొన్నారు.


అర్జీదారుల కోసం కుర్చీలు ఏర్పాటు

పింఛన్ ఇప్పించడయ్యా!
మాది తిరుపతి రూరర్ మండలం. నాకు కొంత కాలంగా కాళ్లుచేతులు పనిచేయడం లేదు. మా ఇంటికి నేనే ఆధారం. ప్రస్తుతం నా పరిస్థితి చాలా దుర్భరంగా ఉంది. నా వైద్య ఖర్చుల కోసం పింఛన్ ఇప్పించండయ్యా..!. తొమ్మిది వారాలుగా కలెక్టరేట్‌కు తిరుగుతున్నా.. అయినా ఫలితం లేదు.
-కే.షణ్ముగం, తిరుచానూరు



పన్నులు చెల్లించినా..పట్టించుకోరా!


కార్యదర్శికి వినతిపత్రం అందిస్తున్న గరుడాద్రినగర్ వాసులు

తిరుపతి రూరల్ : బాలాజీ డెయిరీ నుంచి వచ్చే వృథా నీరు నెలల తరబడి నిల్వ చేరి దుర్వాసన వెదజల్లుతోందని గాంధీపురం పంచాయతీ గరుడాద్రినగర్ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి విజయనిర్మలకు వినతిపత్రం అందించారు. బాలాజీ డెయిరీ వద్ద మురుగు నీటి సమస్య పరిష్కరించాలని, రోడ్లు శుభ్రం చేయించి, వీధి లైట్లు వేయించాలని, రాకపోకలకు ఇబ్బందులు తొలగించాలని పేర్కొన్నారు. సకాలంలో సక్రమంగా పన్నులు చెల్లిస్తున్నామని, తమ ఇక్కట్లను పట్టించుకుని పరిష్కరించాలని కోరారు.

నలుగురికి రిమాండ్


నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ రక్షక్ వాహనం హెడ్ కానిస్టేబుల్ కోదండరామయ్యపై దౌర్జన్యం చేసిన కేసులో నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆదివారం విధుల్లో ఉన్న హెడ్‌కానిస్టేబుల్‌పై జయచంద్రారెడ్డి, అన్వర్‌బాషా, మునిబాలాజీ, లోకేష్‌రెడ్డి అనే వ్యక్తులు దౌర్జన్యం చేసినట్లు వెల్లడించారు. నిందితులను మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా, 15 రోజుల పాటు రిమాండ్ విధించినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐ రామకృష్ణ, హెడ్‌కానిస్టేబుల్ మనోహర్ పాల్గొన్నారు.

సమగ్ర కులగణనకు డిమాండ్

తిరుపతి అర్బన్: సమగ్ర కులగణన చేపట్టాలని బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కల్లూరి నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన నేతృత్వంలో తిరుపతి నగరంలోని డీబీ రోడ్డులోని బీపీ మండల్ విగ్రహానికి పూలమాల వేసి అనంతరం ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. కలెక్టర్‌ను కలిసి ఓ వినతిపత్రాన్ని అందించారు.

ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌పై గెస్ట్ లెక్చర్


ఏఐ, రోబోటిక్స్‌పై అవగాహన కల్పిస్తున్న చరణ్

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, రోబోటిక్స్‌పై గెస్ట్ లెక్చర్ కార్యక్రమం జరిగింది. ఐడబ్ల్యూఐజెడ్ ఆండ్రాయిడ్ రోబో, రోబోటిక్స్ ఏపీ, తమిళనాడు రీజనల్ మేనేజర్ వీ.చరణ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఈసీఈ, ఎలక్ట్రానిక్స్, కమ్యునికేషన్ అండ్ ఇండస్ట్రీ ఇంటర్ కనెక్ట్ విభాగాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ద్వారకనాథరెడ్డి, విభాగాధిపతులు డాక్టర్ గౌరీశంకర్, శైలజ, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

స్కూల్ అసిస్టెంట్‌పై వేటు

తిరుపతి ఎడ్యుకేషన్ : స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లిష్)గా వివిధ పాఠశాలల్లో పనిచేసిన జె.శ్రీనివాసులను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు డీఈఓ కేవీఎన్.కుమార్ సోమవారం తెలిపారు. పిల్లలను కొట్టడం, తోటి ఉపాధ్యాయులతో అనుచితంగా ప్రవర్తించడంతో పాటు వారితో గొడవ పడడం వంటి కారణాలతో ఇదివరకే తాత్కాలికంగా సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ఇతనిపై పలు మార్లు విచారణ చేశారని, విచారణ అధికారులను సైతం ఇబ్బంది పెట్టడంతో పాటు వాట్సాప్ గ్రూపులో అసభ్యకరమైన సందేశాలు పంపడం, యూట్యూబ్ చానల్ లో అసభ్యకరంగా వీడియోలు పెడుతున్నట్లు తెలిపారు. దీనిపై సంజాయిషీ కోరగా సంబంధం లేని విషయాలను క్రోడీకరించి సమర్పించినట్లు తెలిపారు. వీటన్నింటినీ పరిశీలించిన తర్వాత అతన్ని విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు డీఈఓ పేర్కొన్నారు.

పంట బీమాకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్: పంట బీమాకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీఏఓ ప్రసాద్‌రావు తెలిపారు. ఈ మేరకు సోమవారం జేసీ శుభం బన్సల్ చేతుల మీదుగా బీమా పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. వేరుశనగకు డిసెంబర్ 15 వరకు, వరి పంటకు డిసెంబర్ 31వరకు గడువు ఉందని తెలిపారు.

బాక్సింగ్‌లో యోగేష్‌కు కాంస్య పతకం


విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం

తిరుపతి రూరల్: రాష్ట్ర స్థాయి బాక్సింగ్ అండర్-14 పోటీల్లో తుమ్మలగుంట జెడ్పీ హైస్కూల్ విద్యార్థి యోగేష్ ప్రతిభ కనబరచి కాంస్య పతకం సాధించినట్లు స్కూల్ హెచ్‌ఎం గోపినాథ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తుమ్మలగుంట కేవీఎస్ క్రీడామైదానంలో కోచ్ కైలాష్ వద్ద శిక్షణ పొందిన యోగేష్ జాతీయ పోటీలకు సిద్ధం అవుతున్నట్లు వెల్లడించారు.

రెండు బస్సులు ఢీ

చంద్రగిరి: ఎదురెదురుగా వస్తున్న రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొన్న ఘటనలో ప్రయాణికులు స్వల్పగాయాలపాలైన ఘటన మండల పరిధిలోని భాకరాపేట కనుమ రహదారిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. తిరుపతి నుంచి పీలేరు వెళుతున్న ఆర్టీసీ అద్దె బస్సు, మదనపల్లి నుంచి తిరుపతికి వస్తున్న ఆర్టీసీ బస్సును ఘాట్‌రోడ్డులోని పెద్ద మలుపు వద్ద ఢీకొంది. ఈ ప్రమాదంలో రెండు బస్సుల్లో ప్రయాణిస్తున్న 23 మందికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో నారావారిపల్లి సీహెచ్‌సీకు తరలించారు. అందులో కొందరికి మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి తీసుకెళ్లారు. చంద్రగిరి పోలీసులు రాకపోకలను క్రమబద్ధీకరించారు.

కోడి పందెం స్థావరాలపై దాడులు

రామచంద్రాపురం: మండలంలోని యాగప్పరెడ్డి కండ్రిగ సమీపంలో కోడి పందెం స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు. అలాగే 16 ద్విచక్ర వాహనాలు, రెండు కోడి పుంజులు, రూ.1,480 నగదు స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. దాడిలో పోలీసు సిబ్బంది సుధాకర్‌రెడ్డి, సురేష్, రమణ, రమేష్, యోబు, వసంతకుమార్ పాల్గొన్నారు.

రక్షణ కల్పించాలని వినతి


మాట్లాడుతున్న బాధితురాలు శ్యామలకుమారి

తిరుపతి కల్చరల్ : మాయమాటలతో మహిళలను ట్రాప్ చేసి కుటుంబాల్లో చిచ్చు పెడుతున్న యూట్యూబర్ హేమాద్రి నుంచి తమకు రక్షణ కల్పించాలని శ్యామలకుమారి అనే మహిళ విన్నవించారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ తన కుమార్తె నాగవర్ధిని, అల్లుడు లచ్చిరాము మధ్య హేమాద్రి వివాదాలు సృష్టించాడని, తమ బిడ్డను లొంగదీసుకుని ఇంట్లో నుంచి తీసుకెళ్లిపోయాడని ఆరోపించారు. హేమాద్రి దుర్మార్గంపై అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లి దూరం కావడంతో మనవళ్లు విలపిస్తున్నారని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి హేమాద్రిపై చర్యలు తీసుకుని తన కుమార్తెను ఇంటికి చేర్చాలని కోరారు.

స్వామియే శరణం అయ్యప్ప!


తల్లిదండ్రుల కాళ్లను కడుగుతున్న కన్యస్వామి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: తుడా మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఇన్‌చార్జ్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తొలిసారిగా అయ్యప్పమాల ధారణ చేశారు. సోమవారం సాయంత్రం తుమ్మలగుంటలోని ఆయన ఇంటి వద్ద పడిపూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో చేపట్టారు. 'స్వామియే శరణం అయ్యప్ప' అనే మంత్రంతో పూజను ప్రారంభించిన అయ్యప్ప స్వాములు మొదటగా గణపతిని ఆరాధించారు. ఆ తర్వాత సుబ్రమణ్య స్వామిని, పరమశివుడు, శ్రీ మహా విష్ణువులతో పాటు ఆది పరాశక్తి అమ్మవారిని ఆరాధించారు. అయ్యప్ప పంచలోహ విగ్రహానికి అభిషేకం నిర్వహించారు. అయ్యప్ప స్వామికి దీపారాధన చేస్తూ మొక్కులు చెల్లించుకున్నారు. అయ్యప్ప మాల ధారణ చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమం చేశారు.

త్వరలో ఒప్పంద అధ్యాపకుల నోటిఫికేషన్

తిరుపతి సిటీ: ఎస్వీయూలో త్వరలో ఒప్పంద అధ్యాపకుల పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ మేరకు వర్సిటీ అధికారులు ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపినట్టు తెలిసింది. ప్రస్తుతం వర్సిటీలో పనిచేస్తున్న అకడమిక్ కన్సల్టెంట్లకు చరమగీతం పాడేందుకే గత రెండు నెలలుగా వారి సరీ్వసును పొడిగించకుండా, వేతనాలను చెల్లించకుండా మభ్యపెడుతూ అధికారులు కాలయాపన చేస్తూ వచ్చారు.

తమ అనుచర వర్గానికి ప్రాధాన్యం
వర్సిటీలో గత కొన్నేళ్లుగా పనిచేస్తున్న సుమారు 260మంది తాత్కాలిక అధ్యాపకులు రోడ్డున పడేసి తమ అనుచరవర్గానికి పోస్టులను కట్టబెట్టే ప్రయత్నం జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే డిసెంబర్ 15వ తేదీలోపు ఈసీ సమావేశం నిర్వహించి ఒప్పంద అధ్యాపకుల నియామకం కోసం ఆమోదం పొందేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈసీ అనుమతిని పొందిన వెంటనే సుమారు 300 పోస్టులకు నూతన నోటిఫికేషన్ విడుదల చేసేందుకు అధికారులు సర్వ సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

పోలీసుల వేధింపులపై కలెక్టర్‌కు ఫిర్యాదు

చంద్రగిరి(తిరుచానూరు): భూ వివాదంలో తనను తిరుచానూరు పోలీసులు తీవ్రంగా వేధిస్తున్నారని ఓ వృద్ధురాలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో, పోలీసులు వృద్ధురాలిని స్టేషన్‌కు పిలిపించి ప్రత్యర్థుల చేత పరోక్షంగా దాడి చేయించిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకెళితే.. తిరుపతి రూరల్ మండలం, బ్రాహ్మణపట్టు పంచాయతీ పరిధిలోని పాతూరుకు చెందిన కన్నెమ్మకు ఆమె సమీప బంధువు లోకనాథంకి కొన్ని రోజులుగా భూవివాదం నడుస్తోంది. గతంలో లోకనాథంకు ఉన్న భూమిని విక్రయించుకుని సొమ్ము చేసుకున్నాడు. అయితే టీడీపీ అధికారంలోకి రావడంతో కన్నెమ్మ భూమిని కాజేసేందుకు లోకనాథం, స్థానిక నాయకులతో కలిసి బెదిరింపులకు దిగాడు . వృద్ధురాలు కన్నెమ్మ చేసేది లేక గ్రీవెన్స్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి తన గోడు వెళ్లబోసుకున్నారు. దీంతో పోలీసులు ఆమెను స్టేషన్‌కు పిలిపించారు. ఆపై ఎస్‌ఐ సిబ్బంది సమక్షంలోనే కన్నెమ్మ, మనుమడు చెంగారెడ్డి, మధ్యవర్తి భాస్కర్‌రెడ్డిపై ప్రత్యర్థులు లోకనాథం, అంకమ్మ, అశోక్ భౌతికదాడులకు దిగారు.

సరిహద్దు గ్రామాలు గజగజ

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండల అటవీ సరిహద్దు గ్రామాల రైతులు గజగజా వణికిపోతున్నారు. సోమవారం ఈ మేరకు ఏనుగులు ధ్వంసం చేసిన పంటలను స్థానిక ఎమ్మెల్యే, అధికారులు పరిశీలించారు.

వీడిన మిస్సింగ్ కేసు మిస్టరీ!

పాకాల: పాకాలలో ఐదునెలలుగా కనిపించకుండా పోయిన ఉమర్ ఫరూక్ కేసును ఎట్టకేలకు పోలీసులు ఛేదించినట్లు తెలిసింది. ఖననం చేసిన అతడి మృతదేహాన్ని మంగళవారం వెలికితీయనున్నట్లు సమాచారం. స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో చికెన్ షాపు నిర్వహించే ఎస్.ఉమర్ ఫరూక్ ఈ ఏడాది మే 3వ తేదీ నుంచి కనిపించడంలేదని అదే నెల 15వ తేదీన అతడి భార్య తస్లీమాభాను పోలీసులకు ఫిర్యాదు చేశారు. మే 4వ తేదీన ఉమర్ ఫరూక్, మరో ఇద్దరు కలిసి ఎన్నికల కోసం లారీలో మద్యం తెప్పించి పంటపల్లి సమీపంలోని దించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి వెళ్లగా ఉమర్ ఫరూక్ పరారయ్యాడు. మిగిలిన ఇద్దరిని పోలీసులు పట్టుకున్నారు. పరారయ్యే క్రమంలో ఉమర్ ఫరూక్ ఒక పొలంలో అడవిపందుల కోసం ఏర్పాటుచేసిన కరెంట్‌తీగకు తగిలి విద్యుత్‌షాక్‌తో అక్కడికక్కడే మృతిచెందాడు. మరుసటిరోజు ఈ విషయం గమనించిన ఆ పొలం యజమానులు.. మృతదేహాన్ని పూడ్చిపెట్టినట్లు తెలిసింది. ఈ మేరకు విచారణ వేగవంతం చేసిన పోలీసులు అనుమానిత స్థలంలో ఉమర్ ఫరూక్ ప్యాంటును గుర్తించినట్లు సమాచారం.

ఆధునిక మార్పులకు అనుగుణంగా బోధన

రామచంద్రాపురం: ఆధునిక మార్పులకు అనుగుణంగా విద్యా బోధన ఉండాలని జేఎన్‌టీయూ అనంతపురం రిజిస్ట్రార్ కృష్ణయ్య తెలిపారు. సోమవారం వెంకట్రామాపురం సమీపంలోనిసెవెన్‌హిల్స్ ఫార్మసీ కళాశాలలో అధ్యాపక డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ప్రారంభించారు. స్విమ్స్ ఫార్మాకాలజీ విభాగాధిపతి ఉమా మహేశ్వర్ రావు జ్యోతి ప్రజ్వలన చేశారు. వారు మాట్లాడుతూ అధ్యాపకులు నైపుణ్యంతో కూడిన బోధనపై దృష్టి సారించాలన్నారు. ప్రిన్సిపల్ నిరంజన్‌బాబు మాట్లాడుతూ డిజిటల్ ఫార్మసీపై అధ్యాపకులకు శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. వైస్ ప్రిన్సిపల్ ప్రసన్నరాజు, ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ జ్యోతి పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో 'కొక్కొరొకో'..!

చంద్రగిరి: పల్లెటూళ్లలో తెల్లవారకముందే కోడి కోతలకూ లేచే రైతన్నలు, ప్రజలు ఇప్పటికీ లేకపోలేదు. అయితే గొడవలు, తగాదాలతో ఫిర్యాదుదారులతో ఉండే పోలీస్ స్టేషన్ ఒక్కసారిగా కొక్కొరొకో కూతలతో ప్రజల దృష్టిలో పడింది. ఆ కూతలు విన్న ప్రజలు కుతూహలం కొద్దీ పోలీస్ స్టేషన్ కేసి నిక్కి..నిక్కి చూస్తున్నారు. రెండు బలిష్టమైన కోడిపుంజులు పోలీసుల సేవలు అందుకుంటుండడం చూసి ఆశ్చర్యచకితులవుతున్నారు! నా సామిరంగా ఇట్టాంటి కోళ్లు తింటే వండి తింటే ఆ టేస్టే వేరబ్బా!..ఎంతటి కోడి అయినా అర్ధాయుష్షే కదా..అని పోలీస్ స్టేషన్‌లో వాటి కర్మఫలం ఎవరు అందుకుంటారోనని చర్చించుకుంటున్నారు.

ఇంతకూ ఆ కొక్కొరొకో కూతలు ఏం దండోరా వేశాయంటే..రామచంద్రాపురం మండలం యాగప్పరెడ్డి కండ్రిగలో కోడిపందేల స్థావరంపై పోలీసులు చేసిన దాడుల్లో పందెంరాయుళ్లతోపాటు దొరికిపోయిన బుద్ధిజీవులివి! పోలీసులను చూసి కొందరు బతుకుజీవుడా అని పలాయనం మంత్రం పఠిస్తే, పాపం ఇవి మాత్రం మాంచి కండ పుష్టితో మిసమిసలాడుతూ, పిక్కబలం ఎంతో ఉన్నా పారిపోలేకపోయాయి..కాళ్లను చెట్లకు కట్టేసి ఉండటం వల్ల! అంతే కొందరు నిందితులతో పాటు లటుక్కున పోలీసులు వీటిని పట్టేసుకుని యు ఆర్ అండర్ అరెస్ట్ అని సినిమా లెవెల్లో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇక అప్పట్నుంచి కొక్కొరొకో అంటూ రామచంద్రాపురం అంతా వినిపించేలా కూతలేస్తున్నాయ్. పందెం కోళ్ల వ్యవహారంలో ఇవి డేగ, నెమలి జాతి అట! అవి



రామచంద్రాపురం పోలీసు స్టేషన్‌లో పందెం కోళ్లు

తలపడితే మస్తు ఎంటర్‌టైన్‌మెంట్ అట! అవి కలియబడకుండా ఉండేందుకు పోలీస్ స్టేషన్‌లో దూరం దూరంగా కట్టేసి పోలీసులే వాటికి మేత వేస్తున్నారు. వీటి కూతలు విని చూస్తున్న మాంసం ప్రియులు మాత్రం చివరికి ఇవి ఎవరికి మేత అవుతాయోనని ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. వాస్తవానికైతే వీటిని కూడా పందెంరాయుళ్లతోపాటు కోర్టుకు హాజరు పరచి, ఆ తర్వాత వేలం వేయాల్సి ఉంది. ఇక, వేలమా..ఫలహారమా? అనేది వాటి కర్మఫలం అంతే.

'చలో విజయవాడ' అవాస్తవం

తిరుపతి(అలిపిరి): ఆంధ్రప్రదేశ్ సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 10వ తేదీన చలో విజయవాడ నిర్వహించనున్నట్లు సాగుతున్న ప్రచారం అవాస్తవని సంఘం అసోసియేట్ అధ్యక్షుడు చీర్ల కిరణ్ స్పష్టం చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సీపీఎస్, జీపీఎస్ రద్దు, పాత పెన్షన్ పునరుద్ధరణ, ఉద్యోగుల ఇతర సమస్యల పరిష్కారానికి సంబంధించి కూటమి ప్రభుత్వానికి సమయం ఇచ్చామన్నారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంటి ముట్టడి, చలో విజయవాడ అంటూ పలువురు తప్పుడు ప్రకటనలు ఇస్తున్నారని మండిపడ్డారు.